# సందర్శనము

**శుభోదయం. బాలభానుని కాషాయ కిరణాలు ప్రతిష్ఠానపురం మేడలకు, ఓడరేవులకు, దేవాలయ శిఖరాలకు బంగారు పూతలు పూయిస్తున్నాయి. ఉదయ భానునితో పోటీ పడుతూ భూమి పుత్రులు పొలాలు దున్నుతూ పాడుతున్న లల్లాయి పాటలు ఆకాశమార్గంలో ఇంద్రధనుస్సులా వరసలు కట్టి ప్రయాణిస్తున్న పక్షులకు పసందుగా వినబడుతున్నాయి.**

నగరం నడిబొడ్డున నలుగురిలో పేరున్న కుమ్మరి... సారె చక్రాన్ని చకచక తిప్పుతూ మట్టి పాత్రలు, అందమైన బొమ్మల్ని కుదురుగ్గా తయారు చేస్తున్నాడు. విశాల ప్రాంగణం నిండా కుండలు. గురుగులు వరుసగా కవాతు చేసి అలసిన సైనికుల్లాగున్నాయి. శ్రమజీవన సౌందర్యాన్ని, స్వేదబిందువుల్ని ప్రేమిస్తున్న అతడు ప్రజానాయకుడు. ఆ ప్రాంత ప్రజలకు అతని మాట వేదవాక్కు. నుదుట ముత్యాల్లా మెరుస్తున్న చెమట ధారల్ని నెత్తిరుమాలు కొంగుతో అద్దుకుంటూ గుమ్మం వైపు చూశాడు.

గడపలో నవజవ్వని, అందాల భరణి బిక్కు బిక్కుమంటూ తననే చూస్తోంది. దేవలోకం నుండి దిగివచ్చిన అప్సరస, నడివయసులో వున్న తననెందుకు చూస్తోందో! యువతి మొహంమీద ఆందోళన దోబూచులాడుతోంది. వేటగాడు వెంబడిస్తున్న లేడి పిల్లలా బెదురు చూపులు, గుమ్మం దాకా వచ్చాడు.

"మీరెవరు? ఏం కావాలి?" అనునయంగా అడిగాడు.

తాబేలులా ముడుచుకుపోతోందా యువతి. "నేనొక అనాధను, మీరు నా తండ్రిలా కనబడుతున్నారు" గొంతులో గమకం.

కుమ్మరి నిట్టూర్చాడు. "రామ్మా లోపలికి." మట్టికుప్ప పక్కనున్న ఆసనం చూపించాడు.

రాయంచలా వచ్చి కూచుంది. గాలితరగలతో సయ్యాటలాడుతున్న ముంగురుల్ని నాజూకు వేళ్లతో సవరించుకుంది.

"దాన కర్ణులున్న ఈ నగరంలో అనాధ వెలాగయ్యావమ్మా" పైకి మలిచి వున్న ధోవతిని సవరించుకుని కూచున్నాడు. నడుము పైభాగంలో నెత్తిరుమాలు తప్ప మరే అచ్ఛాదనా లేదు.

"అయ్యా!" లోపలి నుండి ఆవేదన పొంగుకొచ్చింది. కొనకొంగుతో కళ్లద్దుకుని చేతులు జోడించింది.

" నా కూతురులాంటి దానివి. చెప్పమ్మా!"

ఆందోళనను అతి ప్రయత్నమ్మీద అదిమిపెట్టింది. "పెళ్లంటే ఏమిటో తెలియని వయసులో నాకు పెళ్లి చేసి అమ్మానాన్నలు చనిపోయారు. సాంసారిక సుఖం రుచి చూడకముందే భర్త మరణించాడు. బాలవితంతునైన నన్ను ఇద్దరు సోదరులు పెంచారు. వయసొచ్చాక తోటి ఆడపిల్లల్ని చూస్తుంటే పెళ్లి, సంసారమంటే ఏమిటో తెలిసొచ్చింది. కోర వయసులో ఉరుకులాడుతున్న వయసు పరువాలు అల్లరి పెట్టసాగాయి. ఓ రోజు గంగానది కెళ్లాను నీళ్ల కోసం. గంగా తీరంలో నవయవ్వన సుందరాకారుడు నాగరాజు నా అందచందాలను ఎగాదిగా చూశాడు. అతని చిలిపి చూపులు నాలో గిలిగింతలు రేపాయి. చూపులు కలిసిన వేళావిశేషమేమిటో కానీ మౌనంగానే మనసు విచ్చిపుచ్చుకున్నాం. కళ్లెంలేని కోర్కెల గుర్రాలు ఇద్దర్నీ ఒక్కటి చేశాయి. ఫలితంగా నేను గర్భవతినయ్యాను. కుటుంబ గౌరవం మంటగలిపానని సోదరులు అవమానాన్ని భరించలేక ఇల్లువిడిచి వెళ్లిపోయారు. ఒంటరి ఆడదాన్ని..అండగా ఎవరూ లేరు.

దయచేసి తలదాచుకునేందుకు....” గాలిలో గడ్డిపోచలా వణుకుతోంది. వెక్కి వెక్కి ఏడుస్తూంటే గుండెలు ఎగసి పడుతున్నాయి.

కుమ్మరి గుండె కరిగి చెరువైంది. “మరి ఆ నాగరాజో?”

“నన్ను తనలోకానికి తీసుకెళ్లనన్నాడు. అత్యవసరమైనప్పుడు తనను స్మరించుకుంటే సహాయం చేస్తానన్నాడు.”

ఇది కలియుగం గదా! ధర్మదేవత ఒంటికాలి మీద నడుస్తుంది. మనుషులంతా దేవుడు చేసిన మట్టిబొమ్మలు. నేనూ బొమ్మలు తయారు చేస్తాను కాని ప్రాణాలు పోయలేను. అంతా పైవాడి లీల.

“నువ్వేమీ భయపడకమ్మా, సువిశాలమైన ఈ ప్రతిష్ఠానపురంలో నీకు నేనున్నాను. నువ్వు నా కూతురు వనుకుంటాను తల్లీ! కళ విద్యలెన్ని నేర్చిన, కులవిద్యల సాటి రాదన్నారు గదమ్మా. నేలతల్లి ప్రసాదించిన ఈ మట్టితో పాత్రలు, బొమ్మలు చేస్తూ తృప్తిగా జీవిస్తున్నాను. నువ్వూ నా కుటుంబ సభ్యురాలివే!” ఆప్యాయంగా తల నిమిరాడు.

భార్యను పిలిచి విషయమంతా వివరించి చెప్పాడు. భార్య ముఖారవిందం సహస్రదళాలుగా వికసించింది. “భగవంతుడు దయతలచి మనకో కూతురును పంపించాడు” అంటూ యువతిని అక్కున చేర్చుకుంది. తలచుట్టూ చేతులు తిప్పి మెటికలు విరుచుకుంది.

xxxxx

సూర్యకిరణాలతో పాటు యువతి ధైర్యం బలం పుంజుకుంది. కుమ్మరి చక్రాన్ని మించిన కాలచక్రం తిరుగుతూనే ఉంది. నెలలు నిండిన యువతికి పుత్రోదయమైంది. పసిబాలుడు బాలభానుని నునులేత కిరణాల్లా మెరిసిపోతున్నాడు. ఆడుతూ, పాడుతూ తాత దగ్గర మట్టి పాత్రలతో పాటు గుర్రాలు, ఏనుగులు, సైనికుల బొమ్మలు తయారు చెయ్యడం నేర్చుకున్నాడు. వాటికి రంగులు అద్ది స్నేహితులతో ఆడుకుంటున్నాడు. తాను రాజుగా, స్నేహితులు సేవకులుగా ఆడుకుంటున్నాడు.

గురుకులంలో సకల శాస్త్రాల నభ్యసిస్తూ పిల్లోడు చిచ్చర పిడుగు అన్పించుకున్నాడు. గుర్రపు స్వారీ నేర్చుకుని అడవి జంతువుల మీద స్వారీ చేస్తున్నాడు. సకల విద్యాపారంగతుడై సింహం మీద స్వారీ చేస్తూ ఉల్లాసంగా ఇంటికొచ్చాడు.

“తాతా! నేనొచ్చాను. ఇటు చూడు” కేకేశాడు.

కుమ్మరి దంపతులు, తల్లి పరుగెత్తుకొచ్చి ఆశ్చర్యంతో బొమ్మలైపోయారు. సింహాన్నెలా వశపరుచుకున్నాడో? అంతుపట్టలేదు.

తల్లి ఆనందాశ్చర్యాలకు అవధుల్లేవు.

ఆశ్చర్యంలోంచి అలవోకగా తేరుకుని గర్వంగా మీసాలు మెలేశాడు కుమ్మరి. భేష్ నాయనా! పసిప్రాయంలో మట్టిబొమ్మలు, వాహనాలు తయారుచేసి పంచి పెట్టావు. ఇప్పుడు సకల విద్యాపారంగతుడివై మృగరాజు మీద స్వారీ చేసి వచ్చిన ధీశాలివయ్యావు. ఇహ నువు శాలివాహనుడవు. మహారాజువై ఓ సామ్రాజ్యాన్ని పాలిస్తావు” అక్కున చేర్చుకుని ఆశీర్వదించాడు.

xxxxx

“రాజాధిరాజ, రాజమార్తాండ! ప్రతిష్ఠాన పురాధీశులు శ్రీశ్రీ శాలివాహన మహారాజుకు బహుపరాక్. సామ్రాజ్య స్థాపకులకు జై... జై...” వంది మాగధుల హెచ్చరికలు.

జయ జమ ధ్యానాలు, పుష్ప వర్షంలో తడుస్తూ శాలివాహన మహారాజు కొదమ సింహంలా వచ్చి సింహాసనాన్నలంకరించాడు. నిండుసభను విహంగ వీక్షణం చేశాడు. సభా కార్యక్రమం ప్రారంభమైనట్టుగా ఘంటికా నాదం వినబడింది.

"మహామంత్రీ! విశేషాలు వివరించండి" గొంతులో గాంభీర్యం.

ఎప్పుడూ అరవిరిసిన గులాబీలా ఉండే మహామంత్రి ముఖం పగటి కలువలాగుంది.

"మన ప్రజలంతా క్షేమమే గదా!"

"మహారాజా!" మహామంత్రి నమస్కరించాడు. "ధైర్య సాహసాలు పెట్టుబడిగా తమరు స్థాపించిన సామ్రాజ్యం నిత్య కల్యాణం పచ్చతోరణం లాగుంది. కానీ... రాజధాని ప్రతిష్ఠానపురవాసులు కొందరు రక్షణ కరువైందనుకుంటున్నారని వేగులు వార్తలందించారు." మహారాజు వజ్ర ఖచిత కిరీటం మెరుపుల్ని చూస్తున్నాడు.

ఆందోళనగా మహారాజు కనుబొమ్మలు పైకి లేచాయి. కిరీట కాంతులుకనుబొమ్మలను నిమిరాయి.

"మహారాజా!" తిరిగి మహామంత్రి అందుకున్నాడు. 'జైత్రయాత్రకు బయలు దేరిన విక్రమాదిత్య మహారాజు ఎన్నో రాజ్యాలను జయిస్తూ మన రాజ్యం సరిహద్దుల్లో కొస్తున్నాడని గూడా వేగుల వార్తలొచ్చాయి."

సభను విషాద ఛాయ లలుముకున్నాయి. అనుకోని ఆపద అతలాకుతలం చేస్తోంది.

"అయితే ఆయనకింకా రాజ్యకాంక్ష తీరలేదన్నమాట" సేనాధిపతి వైపు చూశాడు.

"అవును ప్రభూ!" సేనాధిపతి చేతులు జోడించాడు.

"జగదేకవీరులుగా చరిత్రలో సుస్థిరస్థానం సంపాదించుకోవాలనుకుంటున్నాడు. బలవంతుల ఆశలకు హద్దులుండవుగదా! విక్రమాదిత్యుని సైనిక బలగాలు మన బలగాల కంటే ఎన్నో రెట్లు ఎక్కువ. అతి బలవంతునితో తలపడ్డమంటే పాముల పుట్టలో తలదూర్చడమే. అతనికి దాసోహమనడమే మేలేమో!"

"వీల్లేదు" సభాస్థలి దద్దరిల్లింది.

"స్వయంకృషితో సామ్రాజ్యాన్ని స్థాపించిన మనమే వైరికి దాసోహమనడం అసంభవం. ఇది అవమానకరం కాదా?" మహారాజు మొహం ఎర్రమందారమైంది.

"కాదు మహారాజా! దీన్ని లౌక్యమంటారు. అనువుగాని చోట అధికుల మనరాదు. మహారాజా! భుజబలం కన్నా బుద్ధిబలం మిన్న గదా! విక్రమాదిత్యులవారి అశ్వ, గజ, కాల్బలములు అపారం. అందుకు తగినట్టుగానే మనం ఆలోచించాలి" మహామంత్రి సలహా.

అదే సహేతుక మనిపించింది.

xxxxx

శాలివాహన మహారాజు సాలోచనగా పచార్లు చేస్తున్నాడు. రంగుల హంగుల రాజప్రసాదం చీకటి గుహలా కన్పిస్తోంది... కాకలు తీరిన కళాకారుడు కుమ్మరితాత వారసుడిగా, ఆత్మవిశ్వాసమే ఆభరణమన్న అమ్మగారల బిడ్డగా, పులులను చెవుల పిల్లులుగా మార్చి వశపరుచుకున్నాను. దివారాత్రులు శ్రమించి వ్యవసాయం, చేతివృత్తులు, వాణిజ్యంలో ప్రగతి సాధించాను. విక్రమాదిత్యుని లక్షల సేనలను నాకున్న వేల సేనలతో ఎలా ఎదిరించాలి? కాని భుజబలం కన్నా బుద్ధిబలం మిన్న. "అదెలా?" అంతరాళాల్లోని

ఆందోళన కిరిటాన్ని తీసి పక్క ఆసనంమ్మీదుంచింది. పున్నమి చందమామ మొహాన్ని కేశసంపద కారుమేఘంలా కమ్మేసింది. చేతులు పిసుక్కుంటూ పచార్లు చేస్తున్నాడు.

"నాయనా! శాలివాహనా!" కుమ్మరి తాత పలుకరింపు.

"ఎదుకలా కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నావు?" పట్టుశాలువాను ఒంటినిండా కప్పుకున్నాడు.

"అదేమిటి నాయనా" మరోవైపు నుండి తల్లి.

"ఆందోళనగా ఉన్నావెందుకు బాబూ?" పట్టుచీర కొంగు సవరించుకుంది.

"ఓ సమస్యమ్మా! దీనికి పరిష్కారం మీరే చెప్పాలి తాతయ్యా!" చెరో ఆసనం చూపించి తానో ఆసనాన్ని అలంకరిచాడు.

"చెప్పు మనవడా! ఏవిటా సమస్య?" కుమ్మరి తాత అనునయంగా చెయ్యందుకున్నాడు.

"సమస్యను చాకచక్యంగా పరిష్కరించుకోవాలి." తల్లి మరో చెయ్యందుకుంది.

ఇద్దరి చేతుల్ని ఒడిసి పట్టుకుని కళ్లకద్దుకున్నాడు. విక్రమాదిత్యుని విషయమంతా వివరించి "లక్షల సేనల్ని వేల సేనలతో ఎలా ఎదిరించాలి?" అడిగాడు.

తల్లి, తాత మొహాలు చూసుకుని ఆలోచనలో పడ్డారు.

కుమ్మరి సారెలా తాత బుర్రలో ఆలోచనా చక్రం తిరుగుతోంది. సారెమీద అందమైన పాత్రకు ఆకారంలా ఉపాయంతో అపాయాన్ని ఎదిరించాలనే ఆలోచన బలపడింది.

"దీనికొక్కటే ఉపాయమమ్మా!" కూతిరివైపు తిప్పాడు చూపులు.

"అదేమిటో చెప్పు నాన్నా!" కనురెప్పలు టపటపలాడాయి.

అత్యవసరమైనప్పుడు వచ్చి సహాయం చేస్తానని నీకు నాగరాజు మాటిచ్చాడు గదమ్మా!"

" ఆ అత్యవసరమిప్పుడొచ్చింది. మనవద్ద అశ్వదళం, గజదళం, కాల్బలం సైనికుల బొమ్మలు లక్షల్లో ఉన్నాయి. వాటికి ప్రాణం పొయ్యాలని నాగరాజును ప్రార్థించు తల్లీ!"

"సరే.. నాన్నా!"

ఆశయ సాధన కోసం తల్లి ఆశల పల్లకినెక్కి అడవి చేరుకుంది. ఏకాంతంలో ఆ కాంత త్రికరణశుద్ధిగా నాగరాజును స్మరించింది. వెంటనే ప్రత్యక్షమయ్యాడు.

"దేవీ! ఏమి నీ కోరిక?" చిరునవ్వుతో అడిగాడు.

"నాగరాజా!" చేతులు జోడించింది. గొంతు గద్గదమైంది. "తమరు మహిమాన్వితులు. మీ పేమ ప్రవాహంలో మునకలు వేయించి నన్ను ఒంటరిగా వదిలి వెళ్లారు. ఓ కుమ్మరి ఆశ్రయమిచ్చాడు. మన ప్రేమకు గుర్తుగా మనకో కుమారుడు జన్మించాడు. మీ తెలివితేటలను పుణికి పుచ్చుకున్నాడు. ఇప్పుడు వానికి మీ సహాయం కావాలి."

"చెప్పు దేవీ!" మన చిరంజీవి అజేయుడై నిలవాలి. దానికి నేనేం చెయ్యాలో చెప్పు."

విషయమంతా వివరంగా చెప్పేసింది. ఆ తర్వాత "మట్టి బొమ్మలకు ప్రాణాలు పొయ్యండి. ఆ సైనిక బలగాలతో మన పుత్రరత్నం విజయం సాధించేలా ఆశీర్వదించండి." ప్రాధేయపడింది.

XXXXX

యుద్ధరంగం కురుక్షేత్ర యుద్ధక్షేత్రాన్ని తలపిస్తోంది. అసంఖ్యాకమైన విక్రమాదిత్యుని సేనలు కత్తులు తిప్పుతూ శాలివాహనుని సేనల మధ్యకు చొచ్చుకు పోతున్నాయి. వేలల్లో ఉన్నాయనుకున్న శాలివాహనుని సేనలు లక్షల్లో కన్పిస్తున్నాయి. కత్తులు, డాళ్ల కవాతులు చేస్తుంటే విల్లమ్ములు వీర విహారం చేస్తున్నాయి.

ఆశర్చర్యం... అద్భుతం... రంగులద్దిన శాలివాహనుని మట్టిబొమ్మలకు ప్రాణాలొచ్చాయని అందరికీ తెలిసిపోయింది.

ఇరు సేనలూ ప్రాణాలకు తెగించి పోరాడుతున్నాయి. శాలివాహనుని సైనిక పాటవానికి, యుద్ధ నైపుణ్యానికి తట్టుకోలేక విక్రమాదిత్యుని బలగాలు చెల్లాచెదురైపోతున్నాయి. కేకలు, అరుపులతో యుద్ధరంగం భీబత్సంగా తయారైంది. ఇక లాభంలేదని విక్రమాదిత్యుడు స్వయంగా యుద్ధరంగంలోకొచ్చాడు.

బొమ్మలకు ప్రాణాలొచ్చిన శాలివాహనుని గజ, తురగ, పదాది దళాలను అతని సేన లెదించలేక పోతున్నాయి. రక్తం ఏరులై ప్రవహిస్తోంది. తన సైనిక బలగాలు పీనుగుల పెంటగా మారుతున్నాయి. సాయంకాలమైంది. ఆ రోజుకు యుద్ధం ముగిసింది. రక్తధారలను చూడలేక సూర్యుడు పడమటి కొండల్లోకి పారిపోయాడు. గాయాలపాలైన సైనికుల హాహాకారాలు ఆకాశాన్నంటుతున్నాయి.

విక్రమాదిత్యుడు తన మంత్రులు, సేనా నాయకులతో సమావేశమయ్యాడు. సంప్రదింపులు సాగుతున్నాయి.

"ప్రభూ! శాలివాహన మహారాజు కుమ్మరి కళాకారుడు గదా! అతని వద్ద మట్టితో తయారుచేసిన సైనికుల బొమ్మలు లక్షల్లో ఉన్నాయని, వాటన్నింటికీ ప్రాణాలొచ్చి యుద్ధరంగానికొచ్చాయని వేగుల ద్వారా తెలిసింది" సేనాధిపతి వివరించాడు.

తెల్లవారే సరికి విక్రమాదిత్యుడు తన సేనా బలగాలతో మాయమైనాడు.

అది యుగాది రోజు.

శాలివాహనుని శక్తి సామర్థ్యాలు విశ్వవ్యాప్తమైనాయి. ప్రతిష్ఠానపురంలో విజయోత్సవాలు వెల్లువెత్తుతున్నాయి. విజయానికి శాశ్వత గుర్తింపుగా ఆ రోజు నుండే శాలివాహన శకారంభమైంది.



xxxxx

(ఆంధ్రప్రదేశ్, నవంబర్-2012)
(శాలివాహన, నవంబర్ 2012)